క్లుప్తంగా

మాజీ సీఎం కేసీఆర్‌ను పరామర్శించిన సైదిరెడ్డి



మాజీ సీఎం కేసీఆర్‌ను పరామర్శిస్తున్న హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ సీఎం కేసీఆర్‌ను హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా కేసీఆర్ ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుజూర్‌నగర్ : నియోజకవర్గంలోని మఠంపల్లి, అమరవరం 132 కెవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లలో శుక్రవారం మరమ్మతుల కారణంగా ఆయా సబ్ స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని హుజూర్‌నగర్ విద్యుత్ ఏడీఈ సక్రూనాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు. ఈ విషయాన్ని గమనించి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

చనుపల్లిలో చిరుధాన్యాలపై నేడు అవగాహన సదస్సు

అనంతగిరి : మండలంలోని చనుపల్లి గ్రామంలో గురువారం సిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిరుధాన్యాలపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ చైర్మన్ ఎం.గోపి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా చిరుధాన్యాలు, చిరుధాన్యాల ఉత్పత్తులను ప్రదర్శించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. రైతులు, మహిళలు పాల్గొనాలని కోరారు.

చాకిరాలలో నేడు బొడ్రాయి ప్రతిష్ఠ

నడిగూడెం : మండల పరిధిలోని చాకిరాలలో గురువారం బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం నిర్వహించనున్నట్లు ఆ గ్రామపెద్దలు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామి ఆలయం ఎదుట ధ్వజస్తంభ ప్రతిష్ఠ, విఘ్నేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సు సర్వీసులను విస్తరించాలి

మోతె : కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించినందున ఆర్టీసీ బస్సు సర్వీసులను విస్తరించాలని సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శివర్గ సభ్యుడు మట్టిపెల్లి సైదులు ప్రభుత్వాన్ని బుధవారం డిమాండ్ చేశాడు. అదేవిధంగా ఆరోగ్య శ్రీ పరిమితిని పది లక్షలకు పెంచాలని కోరారు. రాష్ట్రంలో సుమారు 4 వేల గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

16న ఉపాధి హామీ పనులపై ఓపెన్ ఫోరమ్

మఠంపల్లి : మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈనెల 16న ఉదయం 10గంటలకు ఓపెన్ ఫోరమ్ (ప్రజా వేదిక) నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మామిడి జానకిరాములు తెలిపారు. బుధవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. 2022 జనవరి 1వ తేదీ నుంచి 2023 మార్చి 31 వరకు గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పనులపై ఉపాధి హామీ రిసోర్స్ పర్సన్లు, సిబ్బంది గడిచిన వారంరోజులుగా క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు తెలిపారు. ఓపెన్ ఫోరమ్‌కు మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు హాజరుకావాలని కోరారు. ఆయన వెంట ఎంపీఓ అంజనేయులు, ఏపీఓ ఉమాదేవి, నాగాంజనేయులు, తదితరులు ఉన్నారు.

ఘనంగా మాలధారుల ఇరుముడి మహోత్సవం



ఇరుముడులు ధరించి శబరిమలకు బయలుదేరిన అయ్యప్ప మాలధారులు

మునగాల : మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర హనుమాన్ దేవాలయంలో బుధవారం అయ్యప్ప మాలధారుల ఇరుముడి మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గురుస్వామి తడకమళ్ల శ్రీను మాలధారులకు ఇరుముడులు కట్టారు. అనంతరం వారు ఇరుముడులు ధరించి శబరిమల యాత్రకు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో గురుస్వాములు పెంటకొట్టు సురేష్, గాయం శ్రీనివాసరెడ్డి, జల్లా పెద వీరస్వామి, బొబ్బిలి సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిరప సాగుపై రైతుల మొగ్గు

- నీటి సౌకర్యం ఉండడంతో పంట మార్పిడి
- 300 ఎకరాల్లో సేద్యం
- తుపాన్ ప్రభావంతో తెగుళ్లు
- అధికారులు సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరుతున్న రైతులు



వేణుగోపాలపురంలో సాగు చేసిన మిరప పంట



బృందావనపురం వద్ద మిరపకాయలు తెంపుతున్న కూలీలు

నడిగూడెం : మండలంలోని నాన్ ఆయకట్టు ప్రాంతమైన పలు గ్రామాల్లో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది మిరప సాగు చేపట్టారు. గత ఏడాది మిరపకు మద్దతు ధర బాగా ఉండడంతో పాటు బావులు, బోర్ల ద్వారా నీటి సౌకర్యం ఉండడంతో గతంలో కన్నా ఈ ఏడాది అధికంగా మిరప సాగు చేశారు. మండలంలోని బృందావనపురం, వేణుగోపాలపురం, చెన్నకేశ్వాపురం, వెంకట్రాంపురం, కరివిరాల, కాగితరామచంద్రాపురం, నారాయణపురం గ్రామాల్లో దాదాపు 300 ఎకరాలకు పైగా మిరప పంట సాగు చేపట్టారు. గతంలో ఇదే భూముల్లో పత్తి, కంది, పెసర తదితర పంటలను పండించారు. కానీ ఈ ఏడాది పంట మార్పిడి విధానాన్ని చేపట్టి మిరప సాగు చేపట్టారు.

మిరపపై 'మిచాంగ్' ప్రభావం

మండలంలో సాగు చేసిన మిరప పంటపై ఇటీవల కురిసిన మిచాంగ్ తుఫాను ప్రభావం పడింది. దీంతో మిరప పంట తెగుళ్ల సోకాయి. వర్షంతో పాటు కొద్ది రోజులుగా తేమతో కూడిన వాతావరణం ఉండడంతో తామర పురుగు, తెల్లనల్లి, పేనుబంక, మిడ్డి ఈగ, కాయతొలుచు పురుగు, వైరస్, బ్యాక్టీరియా తెగుళ్లు ఆశించడంతో పంట దిగుబడిపై ప్రభావం పడిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎరువులు, సస్యరక్షణ చర్యలు చేపట్టడానికే ఒక ఎకరానికి దాదాపు లక్ష రూపాయల పెట్టుబడి అయిందని పలువురు రైతులు చెబుతున్నారు. నారాయణపురం, కాగితరామచంద్రాపురం, కరివిరాల, వెంకట్రాంపురం, వేణుగోపాలపురం గ్రామాలకు చెందిన రైతులు ఖమ్మం జిల్లా కూసుమంచి నుంచి పురుగు మందులు తెచ్చుకుంటున్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో సలహాలు, సూచనలు ఇస్తే బాగుంటుందని రైతులు అంటున్నారు.

పంట నేలవాలింది



నాకున్న రెండు ఎకరాల్లో తొలిసారిగా మిరప సాగు చేపట్టాను. గత ఏడాది అదే భూమిలో పత్తి సాగు చేశాను. ఈ ఏడాది మిరప సాగు చేశాను. కానీ ఇటీవల మిచాంగ్ తుపాను ప్రభావంతో కురిసిన వర్షంతో చేతికొచ్చే దశలో మిరప పంట నేలవాలింది.

– నారగాని వెంకన్న, రైతు ,బృందావనపురం

తుపాన్‌తో పంటకు తెగుళ్లు



ఈ ఏడాది తొలిసారిగా 1.5 ఎకరాల్లో మిరప సాగు చేపట్టాను. పూత, కాత బాగా ఉన్న దశలో మిచాంగ్ తుపాను ప్రభావంతో పంటకు తెగుళ్ల సోకాయి. దీంతో పెట్టుబడులు బాగా పెరిగాయి.

– లావూరి బాలాజీ, రైతు, వేణుగోపాలపురం

తపాలా ఉద్యోగులపై నిర్లక్ష్యం తగదు



తపాలా ఉద్యోగుల సమ్మెను ఉద్దేశించి మాట్లాడుతున్న నాగరాజు

కోదాడఅర్బన్ : గ్రామీణ డాక్ సేవా (జీడీఎస్) ఉద్యోగుల పట్ల కేంద్ర ప్రభుత్వానికి నిర్లక్ష్యం తగదని ఆలిండియా గ్రామీణ డాక్ సేవా యూనియన్ సూర్యాపేట డివిజన్ కార్యదర్శి నాగరాజు అన్నారు. కోదాడలోని తపాలా కార్యాలయం వద్ద నిరవధిక సమ్మె చేస్తున్న గ్రామీణ తపాలా ఉద్యోగులకు ఆయన బుధవారం సంఘీభావం తెలిపి మాట్లాడారు. కమలేష్ చంద్ర కమిటీ చేసిన 11 సిఫార్సులను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. 8 గంటల పనితో పాటు పెన్షన్ ప్రయోజనాలు అమలు చేయాలని కోరారు. పెయిడ్ లీవ్‌కు 180 రోజుల వరకు దాచుకుని నగదుగా మార్చుకునే సౌకర్యం కల్పించాలన్నారు. జీడీఎస్ ఉద్యోగులను టార్గెట్ రూపంలో వేధించడం ఆపాలన్నారు. కమీషన్ పద్ధతి రద్దు చేసి జీడీఎస్‌లు చేసే ప్రతి పనిని వర్క్‌లోడ్‌కి తీసుకోవాలని కోరారు. తమ డిమాండ్లు నెరవేర్చేవరకు సమ్మె విరమించేది లేదని అన్నారు. యూనియన్ నాయకులు శ్రీకాంత్, పుల్లయ్య, మల్లయ్య, దివ్య, శ్రీను, సైదులు, మగత, గోపీ, నజీర్, వెంకట్, జీడీఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



కౌన్సిలర్ సుగుణమ్మసత్యనారాయణరెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నేరేడుచర్ల : పోలి పాడ్యమి సందర్భంగా బుధవారం నేరేడుచర్లలోని అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. పోలి పాడ్యమి రోజు స్వామివారికి అభిషేకం, పూజలు చేస్తే పుణ్యం లభిస్తుందన్న నమ్మకంతో భక్తులు ఆలయానికి పోటెత్తారు. ఈ సందర్భంగా పూజారి ఉగ్రదండి శివప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో ఆలయంలో పూజలు చేశారు. అదేవిధంగా కుంకుమార్చనలు నిర్వహించారు. కాగా, మున్సిపల్ కౌన్సిలర్ నూకల సుగుణమ్మసత్యనారాయణరెడ్డిలు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల సందీప్‌రెడ్డి ఆలయానికి రూ.50 వేలు, ప్రముఖ వ్యాపారవేత్త వెంపటి వెంకన్న– కరుణ దంపతులు కార్తీక మాసం ప్రసాదాల పంపిణీ కోసం రూ.15 వేలు, కట్ట జాజిరెడ్డి కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి– పల్లవి దంపతులు ధూపదీప నైవేద్యానికి రూ.10 వేలను విరాళంగా అందజేయడంతో వారిని ఆలయ కమిటీ చైర్మన్ రాచకొండ రామకోటేశ్వర్‌రావు సత్కరించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ కార్యదర్శి గజ్జల కోటేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం



అన్నప్రసాదాన్ని తీసుకొస్తున్న దాతలు శాంతిలాల్, మమత

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో బుధవారం బాలాజీనగర్‌కు చెందిన బాణోతు శాంతిలాల్, మమత దాతృత్వంతో అయ్యప్ప మాలధారులకు అన్నదానం చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రేపాల ప్రసాదరావు, చల్లా రామ్మూర్తి తెలిపారు. గెల్లా సరస్వతి జ్ఞాపకార్థం భర్త రంగారావు కూడా అన్నదానానికి సహకరించారని తెలిపారు. ఈ సందర్భంగా దాతలను సత్కరించారు. కార్యక్రమంలో గురుస్వామి రామనాథం, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికులకు ఇచ్చిన హామీ అమలు చేయాలి

హుజూర్‌నగర్ : రాష్ట్రంలోని ఉపాధి హామీ కూలీలు, వ్యవసాయ కార్మికుల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వ్యవసాయ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన కోరారు. రెక్క ఆడితే కాని డొక్కాడని నిరుపేదలైన వ్యవసాయ కార్మికులకు ఏడాదికి రూ.12 వేలు వారి ఖాతాల్లో జమ చేస్తామని చేసిన వాగ్దానం అమలు చేయాలని తెలిపారు. రైతు భరోసా మాదిరిగానే వ్యవసాయ కూలీలకు కూడా కూలీ భరోసా పథకం అమలు చేయాలని ఆయన పేర్కొన్నారు.

క్రీడా ప్రాంగణం భూమిని కాపాడాలని వినతి

మోతె : మండల కేంద్రంలో ప్రభుత్వ క్రీడా ప్రాంగణానికి కేటాయించిన ప్రభుత్వ భూమిని మోతె గ్రామానికి చెందిన కొందరు ఆక్రమిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకొని ఆ భూమిని కాపాడాలని గ్రామ యువకులు కోరారు. ఈమేరకు బుధవారం స్థానిక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువకుల క్రీడాభివృద్ధికి ఏర్పాటు చేసిన భూమిని రక్షించాలన్నారు. కార్యక్రమంలో అనిల్, ఎల్.రాజు, తదితరులు పాల్గొన్నారు.

17 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలో వానాకాలం సీజన్‌కుగాను 19 ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలు ఏర్పాటు చేశారు. వాటిలో 17 కేంద్రాలలో ధాన్యం కొనుగోళ్లు బుధవారం వరకు పూర్తయ్యాయి. మండలంలో సెర్ప్ ఆధ్వర్యంలో 10, జాజిరెడ్డిగూడెం, తిమ్మాపురం పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో 4, జాజిరెడ్డిగూడెంలో రైతు సంఘాల ఆధ్వర్యంలో 2, ఎన్‌డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 3 చొప్పున కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోళ్లను చేపట్టారు. అయితే ఇప్పటి వరకు సెర్ప్, ఎన్‌డీసీఎంఎస్, రైతు సంఘాలు, తిమ్మాపురం పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 17కేంద్రాలలో ధాన్యం కొనుగోళ్లు పూర్తిచేశారు. జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రామన్నగూడెం, కొమ్మాల కేంద్రాలలో ప్రస్తుతం కొనుగోళ్లు జరుగుతున్నాయి. మొత్తం అన్ని కేంద్రాల్లో ఇప్పటి వరకు సుమారు 5లక్షల బస్తాల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. మరో వారం రోజుల్లో కొనుగోళ్ల ప్రక్రియ పూర్తవుతుందని పీఏసీఎస్ అధికారులు తెలిపారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందజేత



తుంగతుర్తి : ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు, ఉపాధ్యాయులు



తిరుమలగిరి : ఆర్థికసాయం అందజేస్తున్న యూత్ క్లబ్ సభ్యులు

తుంగతుర్తి : మండల పరిధిలోని దేవునిగుట్టతండాకు చెందిన గుగులోతు వెంకన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో 2000–2001లో ఆయనతో పాటు చదివిన పదోతరగతి పూర్వవిద్యార్థులు, విద్యాబోధన చేసిన తుంగతుర్తి శ్రీవిద్యాభారతి హైస్కూల్ ఉపాధ్యాయులు కలిసి బుధవారం మృతుడు వెంకన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి మృతుడి భార్య తారాబాయికి రూ.50వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నసీరోద్దీన్, వెంకటగోపాల్, తాళ్లపల్లి సోమన్న, మల్లయ్య, స్నేహితులు వగలగాని మల్లేష్, గుండగాని సుధాకర్, గుగులోతు ఈరోజీ, వెలుగు సైదులు, ఆంబోతు ఈరు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి (తుంగతుర్తి) : మండలంలోని తాటిపాముల గ్రామానికి చెందిన అభ్యుదయ యువజన సమాఖ్య యూత్ సభ్యుడు రేగుల యాదగిరి తండ్రి కొండయ్య ఇటీవల మృతి చెందాడు. బుధవారం మృతుడి కుటుంబ సభ్యులకు అభ్యుదయ యువజన సమాఖ్య ఆధ్వర్యంలో రూ.16వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు రేగుల మహేందర్, రమేష్, దయాయాదవ్, యాకస్వామి, కృష్ణ, ప్రవీణ్, నాగరాజు, సంతోష్, మహేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి పథకం అమలు సంతోషకరం

హుజూర్‌నగర్ : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహాలక్ష్మి పథకం అమలు చేయడం సంతోషించదగ్గ విషయమని విన్నపం ఒక పోరాటం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షురాలు చీకూరి లీలావతి బుధవారం ఒక ప్రకటనలో అన్నారు. మహిళలు పల్లె వెలుగు బస్సులో టికెట్ లేకుండా ప్రయాణం చేయడం స్వేచ్ఛగా, కొత్తగా ఉందని ఆమె తెలిపారు. అధికారులు ఆర్టీసీ బస్టాండ్‌లలో మూత్రశాలలు, మరుగుదొడ్లపై దృష్టి సారించి సౌకర్యాలు మెరుగుపరచాలని ఆమె కోరారు.

కనకయ్య మృతికి సంతాపం

చివ్వెంల(సూర్యాపేట) : మండల పరిధిలోని అక్కలదేవిగూడెం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు మండవ కనకయ్య(50) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని బీఆర్‌ఎస్ మండల నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జూలకంటి జీవన్‌రెడ్డి, సర్పంచ్ పుట్ట గుర్వేందర్, గుగులోతు అనిల్ నాయక్, ఎర్పుల కళ్యాణి, మేరిగ ఈదయ్య తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు వెంటనే పూర్తిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

సూర్యాపేట రూరల్ : గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులు వెంటనే పూర్తి చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై అధికారులకు ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా నర్సరీల్లో నాణ్యమైన మొక్కలు పెంచాలన్నారు. గ్రామపంచాయతీకి సంబంధించిన ఏడు రకాల రిజిస్టర్లతో నివేదిక అందించాలన్నారు. గ్రామాల్లో పరిశుభ్రమైన వాతావరణం ఉండే విధంగా పారిశుద్ధ్యం మెరుగుపర్చాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ పరంకుశరావు, ఏపీఓ వెంకన్న, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి తీర్మానం



ఆలయ అర్చకుడికి తీర్మాన ప్రతిని చూపుతున్న గ్రామస్తులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానందలక్ష్మీ నర్సింహస్వామి ఆలయ అభివృద్ధి దాతల సహకారంతో చేపట్టాలని గ్రామస్తులు ఏకగ్రీవంగా తీర్మానించారు. బుధవారం గ్రామంలో గ్రామస్తులు పార్టీలకతీతంగా కలిసి సమావేశమై ఆలయ అభివృద్ధికి చేపట్టాల్సిన విషయమై చర్చించారు. ముఖ్యంగా ఆలయంలో దాతల సహకారంతో సుమారు రూ.30లక్షలతో రాజగోపురం, కల్యాణమండపం, ఆలయం చుట్టూ రేకుల షెడ్డు నిర్మించాలని నిర్ణయించారు. గ్రామస్తులు కమిటీగా ఏర్పడి దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ అర్చకుల సహకారంతో అభివృద్ధి చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి భక్తమండలి, గ్రామస్తులు, అర్చకులు పాల్గొన్నారు.

ఆలయంలో కార్తీకమాస ముగింపు పూజలు



అన్నపూర్ణ సహిత విశ్వనాథస్వామి ఆలయంలో ఆకాశదీప పూజలు



సంతోషిమాత దేవాలయంలో పూజలకు హాజరైన భక్తులు

భానుపురి (సూర్యాపేట) : సూర్యాపేట పట్టణంలోని శ్రీ సంతోషిమాత ఆలయంలో బుధవారం కార్తీకమాసం ముగింపు సందర్భంగా ఆకాశదీపం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు భట్టారం వంశీకృష్ణ, శ్రీసత్య సాంబశివ స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. ధ్వజస్తంభంపై ఉన్న ఆకాశదీపాన్ని కిందకు దింపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులనుద్దేశించి మాట్లాడారు. కార్తీకమాసంలో దీపారాధనకు ఎంతో ప్రాశస్త్యం ఉందన్నారు. కార్తీకమాసం మొదటి రోజున ప్రారంభమైన ఆకాశదీపం నెలరోజులు పూజలందుకొని ముగింపు కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. చివరి రోజున దీపం వెలిగిస్తే నెల రోజుల ఫలితం ఒక్క రోజులోనే కలుగుతుందని వివరించారు. కార్యక్రమంలో దేవాలయ అధ్యక్ష, కార్యదర్శులు నూక వెంకటేశంగుప్త, బ్రాహ్మండ్లపల్లి మురళీధర్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

విశ్వనాథస్వామి దేవాలయంలో..

సూర్యాపేట పట్టణంలోని అన్నపూర్ణ సహిత శ్రీ విశ్వనాథస్వామి దేవాలయంలో బుధవారం ఆకాశ దీపం పూజను దేవాలయ ప్రధాన అర్చకుడు వలివేటి వీరభద్రశర్మ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ సహాయ అర్చకులు సాగర్‌శర్మ, సిబ్బంది సతీష్, శివ, భక్తులు పాల్గొన్నారు.

నర్సరీల్లో నాణ్యమైన విత్తనాలు నాటాలి

సూర్యాపేట రూరల్ : నర్సరీల్లో నాణ్యమైన విత్తనాలు నాటాలని, నాటి విత్తనాలు మొలకెత్తే విధంగా చూడాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని పిన్నాయిపాలెం, సఫావత్‌తండా గ్రామపంచాయతీల్లోని నర్సరీలను ఆయన పరిశీలించి మాట్లాడారు. నర్సరీల నిర్వహణపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టాలన్నారు. ఆయన వెంట ఏపీఓ వెంకన్న, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు ఉన్నారు.

పాస్టర్ ఆంథోనికి నివాళి

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని బెతేల్ గ్లోబల్ చర్చిలో పాస్టర్ రెంటాల ఆంథోని మొదటి వర్ధంతిని వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బిషప్ దుర్గం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఆంథోని క్రీస్తు సేవలో ఎంతో మంది పాస్టర్లకు చేయూతనందించారని అన్నారు. ఆయన మృతి కుటుంబానికి తీరనిలోటన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు అల్లూరి అబ్రహం, మోజెస్, జాన్‌ప్రకాష్, రాజారత్నం, జీవరత్నం, ఎల్క ప్రభాకర్, లాజర్, ఏసురత్నం, సుధాకర్, డీకెన్ ఫాదర్ యాకోబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రీస్తు జన్మదిన జాతర మహోత్సవం



ఫణిగిరి సీఎస్ఐ చర్చిలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ రుబెన్‌మార్క్

నాగారం : మండల పరిధిలోని ఫణిగిరి సీఎస్ఐ చర్చిలో బుధవారం క్రీస్తు జన్మదిన సాంస్కృతిక జాతర మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్ అధ్యక్ష మండల బిషప్ ప్రొఫెసర్ రూబెన్‌మార్క్, పరిమళా రూబెన్‌మార్క్‌లు చర్చిలో జ్యోతి ప్రజ్వలన చేసి, క్రీస్తు జన్మదిన ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు సుదర్శన్, జాకోబ్, అమృతరావు, పురుషోత్తం, రత్నాకర్, కడారి సోమయ్య, చింతపల్లి విజయ్, జక్కుల రాజు, ముదిగొండ లాజర్, కర్నే మాణిక్యం, గోడిశాల అనిల్, కరుణ యూత్ సభ్యులు, వివిధ గ్రామాల యూత్ సభ్యులు, సంఘ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



బూరుగడ్డ - కరక్కాయలగూడెం రోడ్డు వెంట ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



లక్కవరం వద్ద మూలమలుపులో గుంతలమయంగా రోడ్డు

- రోడ్లవెంట ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు
- గుంతలమయంగా రహదారులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలో పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు ప్రమాదకరంగా ఉన్నాయి. రోడ్లకు ఆనుకొని వ్యవసాయ బావులు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, పైప్‌లైన్ కోసం తవ్విన గుంతలు ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా బూరుగడ్డ గ్రామం నుంచి కరక్కాయలగూడెం వెళ్లే దారిలో మాచవరం వద్ద తదితర ప్రాంతాల్లో రోడ్డుకు ఆనుకొని పదికిపైనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. ఇవి కంపచెట్లతో మూసుకుపోయి ఉన్నాయి. అదేవిధంగా లక్కవరం నుంచి శ్రీనివాసపురం, అమరవరం నుంచి లింగగిరి తదితర గ్రామాలకు వెళ్లే రహదారుల్లో రోడ్లకు ఆనుకొని వ్యవసాయ బావులు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి.

గుంతలు తవ్వారు.. వదిలేశారు

కరక్కాయలగూడెం రహదారిలో గతంలో తవ్వి వదిలేసిన పైప్‌లైన్ గుంతలు ప్రమాదకరంగా మారాయి. సంబంధిత అధికారులు మాత్రం వీటి వద్ద రక్షణ వలయాలు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో నిత్యం ఈ రహదారిలో తిరుగుతున్న ఆటోవాలాలు ఆందోళన చెందుతున్నారు. ఇక రాత్రిళ్లు ప్రయాణం చేసేవారు అరచేతిలో ప్రాణాలు పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. బావులు, గుంతలు కనిపించకుండా పిచ్చి మొక్కలు, కంపచెట్లు కమ్మేయడంతో వాహనదారులు గుర్తించలేకపోతున్నారు. గతంలో మూలమలుపుల వద్ద రాత్రి సమయంలో అనేక ప్రమాదాలు చోటుచేసుకుని పలువురు ప్రాణాలు కూడా పోగొట్టుకున్న ఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, రక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

రక్షణ వలయాలు ఏర్పాటు చేయాలి



బూరుగడ్డ– కరక్కాయలగూడెం, లక్కవరం– శ్రీనివాసపురం రోడ్లలో దారికి ఆనుకొని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, బావులు, గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు రక్షణ వలయాలు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలి.

– వెంకన్న, ఆటో డ్రైవర్, సీతారాంపురం

ప్రమాదాలను నివారించాలి



మా గ్రామం వద్ద రోడ్డుకు ఆనుకొని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కనపడకుండా చెట్లు కమ్మేశాయి. దీంతో దగ్గరకు వచ్చే వరకు ట్రాన్స్‌ఫార్మర్ కన్పించడం లేదు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి ప్రమాదాలు చోటుచేసుకోకుండా చూడాలి.

– షేక్ ఇమామ్, సామాజిక కార్యకర్త, కరక్కాయలగూడెం